# సుశీల

బస్‌స్టాప్‌లో ఆమెను చూడగానే కళ్ళు జిగేల్‌మన్నాయి. 'సు...శీ...ల...' అనే అక్షరాలు పెదవులపై మెదిలాయి.

కారు రివర్స్ చేశాడు రావు.

బస్‌స్టాప్ దాటి కొంత దూరం వెళ్ళి కారు పార్క్ చేసి బస్‌స్టాప్‌లో కొచ్చి ఆమె కంటబడేలా నిలుచున్నాడు. ఆమె వెంటనే చూడలేదు.

కాస్సేపటిలో చూస్తుందని తెలుసు.

రావు గుండెలో సన్నటి పన్నీటి జల్లు మొదలైంది. దాదాపు సంవత్సరం క్రితం ఇదే స్త్రీతో కలిగిన అనుభవం గుర్తొచ్చే సరికి ఒళ్ళంతా మధురమైన పులకింతలతో గగుర్పొడిచింది.

ఆమె బస్ కోసం చూస్తోంది.

వెంటనే వెళ్ళి పలకరించా లంటే జంకుగా అనిపించింది. ఎందరో తెలిసిన వాళ్ళు ఉంటారు. ఎవరు చూసినా బాగుండదు. ఆమె తల తిప్పుకుంటే అసహ్యంగా ఉంటుంది. ఆమె గుర్తుపట్టి స్వయంగా ముందు కొస్తే అది వేరే విషయం. అప్పుడు వ్యవహారం చాలా తేలిగ్గా ఉంటుంది.

ఎవరైనా గమనించి గుర్తు పట్టే లోపలే... ఇద్దరూ సీన్ నుంచి మాయమై పోవచ్చు.

రావు ఇలా అనుకుంటూ ఉండగానే ఆమె చూపులు అతని మీద పడ్డాయి. తామరపువ్వు సూర్య రశ్మికి వికసించినట్టు ఆమె ముఖంలో సంతోషం, సంభ్రమం మెల్ల మెల్లగా వెలిగి విచ్చుకున్నాయి. ఇది వరకటి అనుభవం తాలూకు మధురస్మృతి మెదిలింది కాబోలు సిగ్గు కమ్ము కొచ్చింది.

పగలు మొలిచిన చంద్రుడిలా నవ్వింది. కలువలైన కన్నుల్ని వాల్చి సోగగా చూస్తూ చిన్నగా తలూపింది. బుగ్గలు ఎరుపెక్కి పొంగాయి.

రావు గుండెలో గుర్రాలు పరుగెత్తాయి.

ఆ తర్వాత కొద్ది క్షణాలకి మొదలైంది ఇద్దరి మధ్యా చూపుల భాష.

బస్‌స్టాప్‌లో మిగతా వాళ్ళెవరికీ తెలీకుండా ఇద్దరూ చూపులతో, కనుసైగలతో, అర నవ్వులతో, కనుబొమ్మలతో, పెదవి కదలికలతో... నిశ్శబ్దంగా మాట్లాడుకున్నారు.

నేను...అన్నాడు. అవును తెలుసులే అంది. పోదామా అన్నాడు. వద్దంది. అలా కాదు ...రావాలి అన్నాడు. కుదరదు అంది. ప్లీజ్ అన్నాడు. ఆమె కూడా ప్లీజ్ అంది. అంతేనా అన్నాడు. రాను, రాలేను అంది. ఏం అన్నాడు. బస్ వస్తే వెళ్ళి పోవాలి అంది. కారుంది అని చూపాడు. తెలుసు కాని వద్దు అంది. రూమ్ ఉంది అన్నాడు. ఊఁహూఁ! వద్దే వద్దు అంది. ఏం? అన్నాడు. ఊరుకుంది. రావా అన్నాడు. రాను అంది. ఇష్టంలేదా అన్నాడు. ఊరుకుంది. పోనీ మాట్లాడు కుందాం అన్నాడు. ఏం మాట్లాడా లంది. చాలా ముఖ్యం. చాలా చెప్పాలి అన్నాడు. మాట్లాడ్డమైతే సరేలే అంది. కానీ ఇంకో సారి కన్పిస్తా నంది. మళ్ళీ దొరకవు ఇప్పుడే రా అన్నాడు. రాలేను, రాను అంది.

ప్లీజ్ అంటూ చేతులు జోడించాడు.

చూపుల్లో సైగల్లో అర్థమై పోయింది. అతను కారువైపు నడుస్తూ క్రీగంట గమనించాడు.

ఆమె కూడా బస్‌స్టాప్ దిగి వస్తుండే సరికి మనసు ఆనంద పారవశ్యంతో ఊగింది.

మరి కాస్సేపటికి గర్వంగా కారు డ్రైవ్ చేస్తూ పక్క సీట్లో కూచున్న ఆమెను సున్నితంగా స్పృశించాడు.

ఆమె నెమ్మదిగా చేయి వెనక్కి తీసుకుంది.

"ఏం? అంత బ్రతిమిలాడాలా! ఆ రోజు... మరిచి పోయావా?" అన్నాడు.

ఆమె కారులోంచి ముందుకు చూస్తూ పార్కు మలుపువైపు చూపించి "మాట్లాడా లన్నారుగా... ఇక్కడే ఆపండి... మాట్లాడు కుందాం" అంది.

ఆ ప్రాంతంలో జనం పలచగా ఉన్నారు. రావు కారు ఆపకుండా పోనిస్తూ "రూంకే వెళ్దాంలే" అనే సరికి ఆమె కోపంగా చూసింది.

"ఎక్కడో ఒక చోట ఆపండి... మాట్లాడు కున్నాక నేను దిగిపోతాను" అంది.

"ఏం తొందర? ఇంటి కెళ్ళి పోవాలా? ప్లీజ్... రూంకే వెళ్దాంలే..."

ఆమె బెట్టు చేస్తోం దనుకుంటూ కాస్త బ్రతిమిలాడాడు రావు.

"రూంకే వెళ్ళినా... మనం మాట్లాడుకుందాం అంతే. ఇంకేం వద్దు..."

"ఎందుకలాగ? నా మీద కోపమా?"

"కోపమేంటి మీ మీద? వద్దు అంతే... మీరు చాలా మంచివారు కాబట్టి నమ్మి మీతో వస్తున్నా. కాదంటే చెప్పండి... ఇక్కడే దిగిపోతాను...." మంచివా డనేమాట రావు మనసు మీద మంత్రంలా పనిచేసింది.

కారులో షికార్లు చేస్తూ కనిపించిన అమ్మాయిల్ని రూంకి తీసుకెళ్ళి (పర్సనల్ రూం....మూడో కంటికి తెలీదు) జల్సా చేసే వాడు కూడా మంచి వాడేనా?

"నీ కిష్టం లేకుంటే నేను టచ్ చేస్తానా? పోనీ... నువ్వెలా కావాలంటే అలా ఉండు..." కారు నెమ్మదిగా డ్రైవ్ చేస్తూనే ఆమె మనస్థితిని అంచనా వేయడానికి ప్రయత్నించాడు.

సంవత్సరం క్రితం...

ఒకరోజు మధ్యాహ్నం వేళ బస్‌స్టాప్‌లో తారసపడింది సుశీల.

ఆమె నిలుచున్న తీరులో, చూపుల్లో ఏదో వింత భావం కదలడం చూసి నెమ్మదిగా వెళ్ళి దగ్గరగా నిలుచున్నాడు రావు.

నిండుగా పైట కప్పుకున్నా నిండు యౌవన భారాలు తుళ్ళి పడుతూ ముందు కొస్తున్నాయి.

పెళ్ళయిన స్త్రీ అని తెలుస్తూనే ఉన్నా ఆ చూపుల్లో ఆశ, కోరిక...అణగారని నిప్పులా రేగుతోంది.

కాస్సేపటి లోనే కారెక్కింది సుశీల.

రావుకు ఆ సాయంత్రం దాకా సాక్షాత్తూ స్వర్గమే దిగి వచ్చిన ట్లనిపించింది. భార్య కాక ఎందరో స్త్రీలని చూశాడు కానీ సుశీల తీరు పూర్తిగా వేరు.

ఏకాంతంలో తనువులు పూర్తిగా ఏకమైన వేళ ఆమె పారవశ్యంతో కదిలిన ఆర్తి అతని కెప్పుడూ మరపు రాదు. ఏమిటేమిటో మాట్లాడ బోయాడు గానీ ఆమె దేనికీ బదులు చెప్పలేదు.

కాసరి ముద్దాడింది. తనివి తీరా కౌగిలించు కుంది.

చివరికి బాగున్నానా? అని అతనడిగితే, చాలా గొప్పగా ఉన్నావు అంది.

మళ్ళీ ఎప్పుడు అంటే, ఇంకెప్పుడూ వీలు పడదేమో అంది. బిగి కౌగిట్లో నలిగిన మంగళ సూత్రాన్ని ఆమె సర్దుకుంటూండగా ఓరగా చూశాడు.

బహుశా భర్త దగ్గర సుఖం లేదేమో ననుకున్నాడు.

పేరు చెప్పిందే గానీ అడ్రస్ గానీ ఇతర వివరాలు గానీ ఏమీ చెప్పలేదు. అంతవరకూ దక్కిందే చాలు అనుకుంటూ అప్పటికి సంతోష పడ్డాడు రావు.

సుశీల మళ్ళీ కన్పిస్తుందేమో నని అతని కళ్ళు ఎన్నో సార్లు వెతికి వెతికి ఊరుకున్నాయి.

అలవాటుగా కారులో షికారులు కొడుతున్నా అందిన అందాన్ని అప్పుడప్పుడూ ఆస్వాదిస్తున్నా సుశీల గుర్తొస్తే మాత్రం నరాలు జివ్వుమంటాయి.

ఒక్కో స్పర్శలో ఒక్కో మహాత్యం ఉంటుంది.

సుశీల స్పర్శ రావు శరీరాన్నే కాదు మనసును కూడా తాకింది. చాలా లోతుగా తాకింది.

ఎందుకో ఎలాగో అతనికే తెలీదు!

రూంకి వచ్చే సరికి రావులో కోరికలు ఒక్క సారిగా విజృంభించాయి.

సుశీల స్థిమితంగా కూచోవడాని క్కూడా అవకాశం ఇవ్వకుండా ఆమెను గాఢంగా కౌగిలించుకుని ఆత్రంగా పొదువు కున్నాడు.

గింజుకుంది. విదిలించింది. తిట్టింది.

ముఖం మాడ్చుకుంది. ఛీ. వద్దు. వదులు. అసహ్యం. చూడూ, వద్దంటే వద్దు.

ఇది వరకు ఇలా ప్రతిఘటించ లేదు.

సులభంగా అర్పించు కుంది.

ఇప్పుడు ఎందుకు వద్దంటోంది?

ఎందుకో గానీ కేవలం నటిస్తోం దనుకున్నాడు.

బెడ్ మీద ఆమె కదలడానికి వీల్లేకుండా నొక్కి పడుతూ ఆక్రమించుకుని "వద్దంటే సరిపోతుందా?" అంటూ ముద్దుల కోసం వంగాడు.

హఠాత్తుగా చెయ్యి విడిపించుకుని చెంపమీద కొట్టింది. "మర్యాదగా వదులు.... మాట్లాడాలన్నావ్ మాట్లాడు అంతే!" అంది కాల్చేసేట్టు చూస్తూ.

"ఆఁహాఁ.. నీతో ఏం మాట్లాడతా ననుకున్నావ్?" అన్నాడు రావు వెటకారంగా. "నీలాంటి వాళ్ళు మాట్లాడ్డం కోసమా నాలాంటి వాళ్ళ దగ్గరికి వచ్చేది? నోర్మూసుకుని చెప్పినట్టు విను" అంటూ దురుసుగా ఆక్రమించుకో

టోయాడు.

ఇమె చివ్వున పక్కకి తిరిగి అతన్ని ఏడ దోసి అతని ముఖం మీద ఫెడీఫెడీ మని కొట్టేసింది.

అంత శక్తి, దురుసుతం ఆమెకు ఉంటాయని ఊహించ లేని రావు షాక్ తిన్నట్టు కాస్సేపు అలా ఉండి పోయాడు. అతను దిమ్మెక్కిన తల విదిలించుకునే సరికి ఆమె చేతుల్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

యౌవన శిఖరాల్లాంటి ఎద పొంగులు ఎగసి పడుతుండగా లోపల నుంచి విషాద మంతా కరిగి ప్రవహిస్తున్నట్టు కన్నీరు చెంపల మీదుగా జారి వస్తోంది. మతి చెదిరి మెల్లగా స్థిమిత పడ్డాడు రావు.

"ప్లీజ్! ఏడవొద్దు నిన్ను ఏడిపించడానికి తీసుకురాలేదు. ప్రామిస్! ఏదో బెట్టు చేస్తున్నా వనుకున్నాను గానీ... నీకు ఇష్టం ఉండ దనుకో లేదు. నీకిష్టం లేకుంటే... ఏమీ చెయ్యను. నిజంగా.. నీ మీద ఒట్టు... ప్లీజ్... ఏడవొద్దు" అని అనునయించాడు.

అతనలా ఓదారుస్తూ ఉండగా కాస్సేపటికి ఆమె ఏడుపు ఆపింది గానీ వెక్కిళ్ళు ఆగ లేదు.

"ఏమన్నారు? నాలాంటి వాళ్ళు అన్నారు. మీలాంటి వాళ్ళ దగ్గరికి ఆడవాళ్ళు మాట్లాడ్డానికే రారా? పోనీ మీ రెలాంటి వారైనా... నేను అప్పుడు మీతో అలా... ఇక్కడికి వచ్చాను గానీ... నిజంగా నేను... అటువంటి దాన్ని కాను"

"ఓ..కే! నాదే తప్పు!"

"తప్పెవరి దనికాదు. నేను ఒకరి భార్యను. ఆ రోజు మీతో గడిపానని ప్రతిసారీ వస్తానని కాదు"

"అదే నాకు అర్థం కాలేదు సుశీలా! అప్పుడు మాత్రం నామీద ఇష్టం ఉంది కదా? ఇప్పుడు లేదా? సారీ... నా ఉద్దేశ్యం... నువ్వు ఎవర్తో పడితే వాళ్ళతో వెళ్తా వని కూడా కాదు..." అన్నాడు రావు.

"మీ ఉద్దేశం ఏదైనా... నన్ను మీరు అర్థం చేసుకో వాల్సిన అవసరం కూడా లేదసలు..."

"అదేంటి?"

"అవును...మిమ్మల్ని తొలిసారి చూసినప్పుడు కూడా మీమీద ఇష్టంతో రాలేదు."

"మరి?"

"కసి...పగ....ప్రతీకారం!"

"ఎవరి మీద?"

"మావారి మీద!"

"వ్వాట్!"

"బోల్డు కట్నంతో ఇష్టపడి చేసుకున్న పెళ్ళే మాది! అయినా మా వారికి నేనంటే ఆర్నెల్లకే మొహం మొత్తింది. పరాయి ఆడది కనిపిస్తే చాలు... ఏ మాత్రం అవకాశం దొరికినా చాలు... వెళ్ళిపోవడమే! మావా ళ్ళందరికీ తెలిసి పోయింది. ఆయన... ఎవరెంత చెప్పినా వినరు. నేను నిలదీస్తే తంతారు. తాగి వస్తారు. గొడవ. ఇంట్లో అరుపులు, కేకలు..."

సడన్‌గా తెలిసినా అసలు విషయం అర్థమౌ తుండగా "అలా అయితే... ఇంట్లో శాంతి వుండదు. భర్త దగ్గర సుఖం వుండదు." అన్నాడు రావు.

ఆ అభిప్రాయం తప్పన్నట్టు తల అడ్డంగా తిప్పింది సుశీల. "మళ్ళీ ఆయనకు నేనంటే ఇష్టం. ఆయనంటే నాకు ప్రాణం. ఆయన్ని వదులుకోలేను."

"మరి?"

"ఆయన తిరుగుళ్ళు చూస్తే... తిక్క రేగి పోతుంది. ఒంటరిగా గడిపే రాత్రిళ్ళు చాలా భయంకరం! పోనీ చచ్చి పోదామా అనిపిస్తుంది. కానీ నేనెందుకు చచ్చి పోవాలి? నా తప్పేమిటి? ఆయన మారరు. మార్చలేను. నేను అశాంతిని అనుభవించ కుండా ఉండాలంటే నేనూ తప్పు చెయ్యాల్సిం... ...ం"

"వ్వాట్!"

"అందుకే... ఒక సారి...ఒకే ఒక్క సారి....మీతో గడిపాను. మావారు తప్ప ఈ శరీరాన్ని టచ్ చేసిన మగవారు మీరొక్కరే. మరెవ్వరూ తాకరు. తాక నివ్వను. మీరు పరమ దుర్మార్గులో ఏమో గానీ ... నా కంటికి ఎందుకో మంచి వ్యక్తిలా అనిపించారు. అలాగని...మళ్ళీ మీతో అనుబంధం ఇష్టం లేదు. మీతో మాట్లాడ్డం కూడా ఇష్టం లేదు. కానీ ఇందాకా మీరు బస్‌స్టాప్‌లో...చాలాసేపు... అంతగా ప్రాధేయ పడుతుంటే... కాదన కూడదు... మిమ్మల్ని అంత కటువుగా దూరం చేయ కూడదని... ఇలా వచ్చాను... అంతే గానీ... అంతే గానీ..."

మెరుపు మీద మెరుపు మెరుస్తూ కళ్ళు బైర్లు కమ్మినట్టు అతను అలా చూస్తూండి పోయాడు.

తెల్లవారుతున్నా రావుకి నిద్రపట్టలేదు.

బెడ్‌లైట్ నీలి వెల్తురులో భార్య అమృత అప్సరసలా శయనిస్తోంది. అలసి పోయిన అప్సరస.

మూడేళ్ళ వైవాహిక జీవితంలో ఆమె ఎప్పుడూ రావు మీద కోపం తెచ్చుకో లేదు. దేనికీ లోటు చెయ్యలేదు. ఆమె మనసులో మర్మం ఉండే అవకాశం ఉందని కూడా రావు అనుకో లేదు.

ఆమె ముఖం లోకి పరీక్షగా చూశాడు.

నిద్రలో నవ్వుకుంటోంది. తృప్తి నిండిన నవ్వు. శాంతంగా, గంభీరంగా.

తను ఇల్లు పట్టకుండా తిరుగుతాడని ఆమెకు తెలుసు. ఎందుకు ఏమిటి అని అడగదు.

ఇతర స్త్రీలతో సంబంధా లున్నాయని ఆమెకు తెలియదు. తెలియ నివ్వకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉంటాడు రావు.

కానీ ఎప్పటికైనా ఎలాగైనా తెలిస్తే? అప్పుడు?

నిద్రలో చిన్నగా కదిలిన అమృత రావు ఇంకా మేలుకుని ఉండడం గమనించి, "ఏంటండీ? ఏంటీ ఆలోచిస్తున్నారూ?" అంది మెత్తటి స్వరంతో.

"ఏం లేదు ...నాకో సందేహం" అన్నాడు.

"ఆహాఁ...ఏమిటో?"

"నేనెప్పుడూ ఇల్లు పట్టకుండా తిరుగుతుంటాను కదా... ఎప్పుడైనా మీతో అలం... [illegible] అమ్మాయి కనిపించిం దనుకో.. ఆహాఁ...మాటవరసకి కాను" [illegible] అనుకుందాం... [illegible]ను ఏదో మోజుపడి... ఆ అమ్మాయితో గడిపా ననుకో... అలా అలవాటై పోయి... తరచూ అమ్మాయిలతో గడుపుతూ ఉంటే..."

అంటూ రావు చెప్తుండగా అతన్ని వాటేసుకుని బుగ్గమీద ముద్దు పెట్టుకుంది అమృత. "మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. నాకేం?"

"ఇప్పుడలా అంటావులే! నిజంగా నేనే గనుక అలా చేస్తే...?" అన్నాడు రావు రెట్టిస్తూ.

"చేస్తే ఏంటి? ఇప్పుడే కూడా అలా చేస్తున్నారేమో? నేను చూడొచ్చానా?"

"చూడొచ్చావనుకో... అప్పుడు నా మీద నీకు పగ .... కసి .... ప్రతీకారం... వగైరా..."

"ఇంకా నయం..." అంటూ ముద్దు పెట్టిన చెంపనే చురుక్కున కొరికింది.

"ప్రతీకారం కోసం నన్ను కూడా ఏదైనా తప్పు చెయ్యమంటా రేంటి?

ఊరుకోండి..."

ఊరుకున్నాడు రావు.

ఇదంతా జరిగి చాలా రోజులై పోయింది.

ఒకరోజు సాయంత్రం రావు ఇంటి కొచ్చే సరికి అమృత ఇరుగింటావిడతో నెమ్మదిగా అంటున్న మాటలు చెవిన పడ్డాయి.

"ఈ మధ్య మావారు చాలా మారిపోయారు. తిరుగుళ్ళు తగ్గించేశారు. ఎక్కువ టైం నాతోనే గడుపుతున్నారు. నాకెంతో హాప్పీగా ఉంది తెలుసా? నిజంగా నేనెంతో అదృష్టవంతు రాలిని..."

రావు మనసులో పన్నీరు విచ్చల విడిగా కురిసింది. "థేంక్యూ సుశీలా... థేంక్యూ..." అని గొణుక్కున్నాడు సంతోషంగా.

22.11.1996 సంచిక